క్లుప్తంగా

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

తెనాలిటౌన్: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఆంధ్ర ప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు ఆరోపించారు. మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. డాక్టర్ సాంబశివుడు మాట్లాడుతూ బడ్జెట్‌పై పెదవి విరిచారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పొన్నూరు శ్రీధర్, నాయకులు పి.శివకుమార్, ప్రభాకర్, షేక్ మాబు, పి.స్టీవెన్‌బాబు, పి.శివన్నారాయణ, ఎ.కృష్ణ, ఎస్.సుబ్బారావు, బి.శ్రీను, వెంకటేష్, వీరస్వామి, నమన మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి జారి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తెనాలి రైల్వే స్టేషన్ వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 55 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి తెనాలి రైల్వే స్టేషన్ దక్షిణ క్యాబిన్ సమీపంలో పట్టాల మధ్య మృతి చెంది ఉన్నాడన్న సమాచారంతో జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని గురువారం పరిశీలించారు. మృతదేహం పూర్తిగా ఛిద్రమై ఉంది. నల్ల ఫ్యాంటు ధరించి ఉన్నాడు. జేబులో బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు తెనాలి నుంచి నెల్లూరుకు తీసుకున్న టికెట్ ఉంది. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముత్తెంశెట్టిపాలెంలో బైక్ దగ్ధం

తెనాలిరూరల్: పట్టణ ముత్తెంశెట్టిపాలెంలో బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. రోడ్డు వెంబడి నిలిపి ఉన్న బైక్‌కు నిప్పంటించి పరారయ్యారు. బైక్ నుంచి మంటలు చెలరేగడాన్ని గమనించిన యజమాని మంటలను ఆర్పి పోలీసులను ఆశ్రయించాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేద గిరిజనులకు చీరలు పంపిణీ



తెనాలిఅర్బన్: ట్రైబల్స్ చారిటబుల్ ఇండియా సంస్థ అధినేత రావూరి అంజలి ఆధ్వర్యంలో వీఎస్సార్ కళాశాల ఎదురుగా కాల్వకట్టపై నివసిస్తున్న పేద గిరిజనులకు గురువారం చీరలను పంపిణీ చేశారు. అలాగే భోజనం ప్యాకెట్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ రావూరి సురేష్‌బాబు, సభ్యులు బొంత కృపమ్మ, అద్దంకి పద్మ పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

కొల్లూరు: నదీ పరీవాహక భూముల విషయంలో జరిగిన ఘర్షణలో ఎస్సీ వర్గీయులపై దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు, కె.హరిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని చింతర్లంకలో జరిగిన ఘర్షణలో స్వల్పంగా గాయపడిన వారిని గురువారం పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. దాడి చేసిన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు, 307 సెక్షన్ కింద కేసు నమోదు చేయాలన్నారు. చింతర్లంక, పెదలంక గ్రామాలకు చెందిన ఎస్సీలకు రక్షణ కల్పించడంతోపాటు, జిల్లాస్థాయి నాయకులు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ గ్రామంలో పర్యటించి తగిన న్యాయం జరిగేలా చూడాలన్నారు.

అప్రమత్తంగా ఉన్నప్పుడే రోడ్డు ప్రమాదాల నివారణ

బాపట్లటౌన్: డ్రైవర్లు అప్రమత్తంగా ఉన్నప్పుడే రోడ్డు ప్రమాదాలను పూర్తి స్థాయిలో నివారించవచ్చని డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ గ్యారెజ్‌లో గురువారం జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రైవర్లు బస్సులను నడిపే సమయంలో ఏకాగ్రతతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మోటారు వాహనాల తనిఖీ అధికారి డి.రంగారావు, జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ వై.విజయ్‌కుమార్‌రెడ్డి, బాపట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ టి.అజితకుమారి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

బాపట్లటౌన్: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైన ఘటన పట్టణంలోని వెంగళ్విహార్‌లో గురువారం జరిగింది. చింత సుదేవ్‌కు చెందిన పూరిల్లు మంటలు చెలరేగి అగ్నికి ఆహుతైంది. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. అప్పటికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది.

కోడిపందేల స్థావరంపై దాడి

భట్టిప్రోలు: బాపట్ల అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు రేపల్లె సెబ్ సీఐ శ్రీనివాసులు, సిబ్బంది కోడి పందేలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో గురువారం దాడులు చేశారు. మండలంలోని పెదపులివర్రు గ్రామ శివారు బుసకలంక సమీపంలోని పెదపాలెం పంట పొలాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.3 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

నిత్య సహాయమాతా వందనం

వైభవంగా ఆర్సీఎం చర్చి మహోత్సవం



విద్యుద్దీప అలంకరణలో ఆర్సీఎం చర్చి

తెనాలిటౌన్: స్థానిక చెంచుపేటలోని నిత్య సహాయమాత(ఆర్‌సీఎం) చర్చి మహోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. గత నెల 24 నుంచి భక్తిశ్రద్ధలతో నవదిన ప్రార్థనలను విచారణ గురువు గురుశ్రీ విజయానంద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం నిత్య సహాయమాత ఆలయంలో గురుశ్రీ జి.విజయ్‌కుమార్ దివ్యబలిపూజను నిర్వహించారు. పూజ అనంతరం నిత్య సహాయమాత స్వరూపంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ జరిపారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఫాదర్‌లు విజయానంద్, సాగర్, మార్టిన్, సంఘస్తులు ఎమ్మెల్యే శివకుమార్‌ను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ప్రార్థనల్లో యాతాటి అనిల్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఆలయ ఆవరణలో సమష్టి దివ్యబలి పూజను గురుశ్రీ ఎం.చిన్నప్ప (విజయవాడ మేత్రాసనం) జరిపారు. అనంతరం బైబిల్ గ్రంథం నుంచి ఆయన వాక్యోపదేశం చేశారు. దివ్యబలిపూజల్లో ఫాదర్లు విజయానంద్, జయ్‌కుమార్, సాగర్, మార్టిన్, మోజెస్, డేవిడ్, సునీల్, బాలశౌరి పాల్గొన్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆర్‌సీఎం చర్చికి విద్యుద్దీప అలంకరణ చేశారు. దివ్యబలి పూజల్లో యువతీయువకులు ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి.



ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



నిత్య సహాయమాత స్వరూపంతో ప్రదక్షణలో పాల్గొన్న ఫాదర్‌లు

బాలామృతంపై అవగాహన సదస్సు



బాలామృతం ప్యాకెట్లను అందజేస్తున్న సీడీపీవో గీతాంజలి

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు సెక్టార్ పరిధిలోని హాఫ్‌పేట శివారు జాకీర్ హుస్సేన్‌నగర్‌లో గురువారం అంగన్‌వాడీ కేంద్రంలో బాలామృతంపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెనాలి సీడీపీఓ డి.గీతాంజలి మాట్లాడుతూ ప్రతి నెలా ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల్లోపు పిల్లలకు 2.5 కిలోల బాలామృతం ఇస్తామని పేర్కొన్నారు. బాలామృతంలో కాల్షియం, ఐరన్, విటమిన్స్, ఇతర పోషకాలు ఉంటాయని వెల్లడించారు. రోజూ పిల్లలకు 100 గ్రాములు చొప్పున పెట్టడం వల్ల వారికి పోషకాలు అంది వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు పెరుగుతారని పేర్కొన్నారు. పోషణ లోపాన్ని నివారించవచ్చని తల్లులకు సూచించారు. బాలామృతం ప్యాకెట్లను తల్లులకు అందజేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో యు.విజయశ్రీ, సూపర్‌వైజర్ యామిని, తెనాలి–1 సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.సుచిత్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

క్లారినెట్ విద్వాంసుడు కోటేశ్వరరావుకు సన్మానం



కోటేశ్వరరావును సన్మానిస్తున్న రాజేంద్రప్రసాద్, రాజారావు తదితరులు

తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంత్యుత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం తల్లిప్రేమ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం తోడునీడ చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ క్లారినెట్ విద్వాంసుడు చింతలపూడి కోటేశ్వరరావును సన్మానించారు. కార్యక్రమంలో కోనేరు బాలకోటేశ్వరరావు, తాళ్లూరి రాజేంద్రప్రసాద్, తాళ్లూరి రాజారావు, చింతలపూడి మల్లిఖార్జునరావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, కేసన కోటేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని.. విరిగిన విద్యుత్తు స్తంభం



ఆవులవారిపాలెంలో విరిగిన విద్యుత్తు స్తంభం

కొల్లూరు: లారీ ఢీకొని విద్యుత్తు స్తంభం విరగడంతో విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనలో పెను ప్రమాదం తప్పింది. మండలంలోని ఆవులవారిపాలెంలో బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ.. స్థానిక రాములవారి ఆలయం వద్ద మలుపులో ఉన్న విద్యుత్తు ఇనుప స్తంభానికి తగిలింది. లారీ వెనుక చక్రం స్తంభానికి పట్టుకోవడంతో అక్కడే ఉన్న యువకులు గమనించి లారీ డ్రైవర్‌ను అప్రమత్తం చేసినా ముందుకెళ్లాడు. స్తంభం సగానికి పైగా విరిగి పోయి తీగల ఆధారంతో కాసరంను ఆసరాగా చేసుకుని వేలాడింది. స్తంభం విరిగిన ధాటికి వైర్లు తెగిపడినట్లయితే ఆ ప్రాంతంలో ఉన్న స్థానికులు, లారీ డ్రైవర్ ప్రాణాలకు ప్రమాదం వాటిల్లి ఉండేది. ఈ ఘటనలో సుమారు రూ.32 వేల వరకు నష్టం, లంక గ్రామాలకు సుమారు 8 గంటల పాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆ శాఖ సిబ్బంది శ్రమించి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. పోల్ విరగడానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఏఈ సుధాకర్‌బాబు తెలిపారు.

ప్రభుత్వాల దృష్టికి మాజీ సైనికుల సమస్యలు



సమావేశంలో మాట్లాడుతున్న బ్రిగేడియర్ వెంకటరెడ్డి

రేపల్లె రూరల్: మాజీ సైనిక ఉద్యోగులకు కల్పించాల్సిన సౌకర్యాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించాలని బ్రిగేడియర్ వెంకట రెడ్డి కోరారు. మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పట్టణంలోని మత్స్యకార భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సైనిక ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని.. ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాల్లో సమావేశాలు నిర్వహించి, సమస్యలు గుర్తిస్తున్నట్లు తెలిపారు. రేపల్లె తాలూకా పరిధిలోని మాజీ సైనిక ఉద్యోగులు పలు సమస్యలను తెలియజేశారు. బాపట్ల క్యాంటీన్‌లో నిత్యావసరాలు, ఇతర వస్తువులు అందుబాటులో ఉండటం లేదని, ఆరోగ్య పరమైన ఇబ్బందులు ఎదురైతే.. గుంటూరు, విజయవాడ వంటి పట్టణాలకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సైనిక ఉద్యోగుల వెల్ఫేర్ ఆఫీసర్ షీలా తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



తెనాలి: పట్టణ సుల్తానాబాద్‌లోని ఇండస్ట్రియల్ ఏస్టేట్‌లోని కుమార్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్‌లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి రక్తనిధి కేంద్రం అధికారిణి డాక్టర్ కె.శిరీష, బాపనయ్య, స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు. సంస్థలోని 80 మంది కార్మికులు రక్తదానం చేశారు. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం సతీమణి వసుంధర 63వ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. కొత్త శ్రీనివాసరావు, కృష్ణకుమార్, హరికుమార్, శేషుకుమార్ పర్యవేక్షించారు. సేవా కార్యక్రమాల్లో తమ సంస్థ సిబ్బంది ఎప్పుడూ ముందుంటారని హరికుమార్ గుర్తు చేశారు. ఈనెల 5న శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం ఏర్పాటుచేసినట్టు చెప్పారు.

వీడియో సాంగ్ షూటింగ్



తెనాలిఅర్బన్: ది స్ట్రేంజ్ డ్రీమర్స్ బ్యానర్‌పై రూపొందిస్తున్న మాస్టార్ మాస్టార్ వీడియో సాంగ్ షూటింగ్‌ను గురువారం చినరావూరులోని సోమేశ్వరస్వామి దేవస్థానంలో ప్రారంభించారు. నటీనటులపై టెలిఫిలిమ్ దర్శకుడు కనపర్తి రత్నాకర్ క్లాప్ కొట్టారు. అనంతరం పలు సన్నివేశాలను చిత్రీకరించారు. కార్యక్రమంలో కిరణ్ కొండ్రు దర్శకత్వం వహించగా, హీరోహీరోయిన్లుగా బబులు చెర్రీ, కావ్యాలు నటిస్తున్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



తెనాలిటౌన్: చెంచుపేటలోని నిత్య సహాయమాత చర్చి పండుగ సందర్భంగా చావావారిపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ తమనం మోషె సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు మిఠాయిలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉదయభాస్కర్, ఉపాధ్యాయరాలు నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో ముగిసిన జాతీయ సదస్సు



సదస్సు ముగింపు సభలో ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ కరుణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో 'అడ్వాన్సస్ ఇన్ ఫైటోమెడిసిన్ అండ్ ఫైటోనానోకంపోజిట్స్' అనే అంశంపై రెండు రోజులు నిర్వహించిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి.కరుణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రసంగిస్తూ రోగాల్ని తగ్గించడానికి పూర్వీకులు ఉపయోగించిన మూలికా వైద్యం నేడు సాంకేతికంగా నిర్ధారించబడినట్లు తెలిపారు. కరోనా కారణంగా మొక్కల నుంచి సేకరించే సహజసిద్ధ మందులు వాడకం పెరిగిందని చెప్పారు. వైద్యులు మందులతో వైద్యం చేస్తే, వాటిని తయారు చేసేవారు ఫార్మసిస్టులు అని పేర్కొన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీలారాణి మాట్లాడుతూ సంప్రదాయ వైద్యం ప్రాముఖ్యత పెరిగిందని, దీనిపై పరిశోధనలు కొనసాగించాలని తెలిపారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న కంబైన్డ్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ ఇన్ ఫార్మసీ, చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యదేవర విద్యాధర్ ప్రసంగిస్తూ రోగాల్ని తగ్గించడానికి కొత్త అల్లోపతి మందులు ఎన్ని వచ్చినా సైడ్ ఎఫెక్ట్స్ తక్కువగా ఉండి శక్తివంతంగా పనిచేసే ఆయుర్వేద మందుల ఆవశ్యకత పెరిగిందని తెలిపారు. రెండవ రోజు జరిగిన ప్లీనరీ సెషన్‌లో అట్లాంటిస్ ఫైటోటెక్ చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ డాక్టర్. కె. బాబూరావు ప్రసంగిస్తూ మొక్కల సెకండరీ మెటబాలైట్స్ అయిన ఆల్కలాయిడ్స్, స్టెరాయిడ్స్, ఫినోలిక్స్, ఫ్లావనాయిడ్స్ వంటివి మందులు తయారీలో ఉపయోగపడతాయని తెలిపారు. ఢిల్లీ ఫార్మసిటికల్ సైన్స్ రీసెర్చ్ విశ్వవిద్యాలయ అధ్యాపకులు డాక్టర్. ఎం. ఆర్యలక్ష్మి మాట్లాడుతూ నానో టెక్నాలజీని ఉపయోగించి గ్రీన్ సింథసిస్ ద్వారా శక్తివంతమైన మందుల్ని తయారు చేయవచ్చని చెప్పారు. అసోసియేషన్ ఆఫ్ ఫార్మసోటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ శాఖ సెక్రటరీ, వి.జె.ఎస్ ఫార్మసీ కళాశాల రాజమండ్రి ప్రిన్సిపాల్ డాక్టర్. డి.నరేంద్ర ప్రసంగిస్తూ కరోనాతో సంప్రదాయ వైద్యం ప్రాముఖ్యత పెరిగిందని పేర్కొన్నారు. ముగింపు సభలో సెమినార్ డైరెక్టర్ డాక్టర్ పి. రవి రెండు రోజులపాటు జరిగిన కార్యక్రమ వివరాల్ని నివేదించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల అధ్యాపకులు డి.రవిశంకర్‌రెడ్డి, యు.అన్నపూర్ణ, పి.రోహిణి, కె. సుజన, ఎం. గాయత్రీ రమ్య, కె.ఈ.ప్రవళిక, సీహెచ్. సజిని, షేక్ మస్తానమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు హోంవర్కులు ఇవ్వాలి

- నిరంతరం పర్యవేక్షించాలి
- ఉపాధ్యాయులకు డీఈఓ శైలజ ఆదేశం



విద్యార్థుల హోంవర్కులను పరిశీలిస్తున్న డీఈఓ శైలజ

శిరిపురం(కొల్లిపర): పాఠశాలల్లో విద్యార్థులకు హోంవర్కులు ఇచ్చి అవి చేస్తున్నారో లేదో నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం శిరిపురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక ఎల్ఈ పాఠశాలను ఆమెతోపాటు విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ వి.వి.సుబ్బారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల కాంపౌండ్ నిర్మాణం, విద్యార్థుల హాజరు, హోంవర్కులు, రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల హోంవర్కుల విషయంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలో రోజూ ఇస్తున్న హోంవర్కులు విద్యార్థులు రాయటం లేదని, ఎక్కువ మంది ఉపాధ్యాయులు సరిగా చూడడం లేదని పేర్కొన్నారు. ఇక నుంచి ఎంఈఓ ప్రతి రోజూ ఒక పాఠశాలను తనిఖీ చేసి ఉపాధ్యాయుల పనితీరుపై పర్యవేక్షణ పెట్టాలని సూచించారు. నివేదికలను జిల్లా కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. మరి కొన్ని రోజుల్లో తాను స్వయంగా మండలంలో ప్రతి పాఠశాలనూ సందర్శించి విద్యార్థుల హోంవర్కులు పరిశీలిస్తానని వివరించారు. అప్పటికీ పనితీరు మారకుంటే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మనబడి నాడు–నేడు ద్వారా పాఠశాలలో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్‌సీఓ ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ హ్యాండ్‌బాల్ జట్టుకు ఏడుగురు ఎంపిక



కాలేజి హ్యాండ్‌బాల్ జట్టుతో ఎమ్మెల్యే శివకుమార్, రామ్‌చంద్

తెనాలి: దక్షిణ మండల అంతర విశ్వవిద్యాలయాల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఆచార్య నాగార్జున యూనివర్శిటీ జట్టుకు స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి క్రీడాకారులు ఏడుగురు ఎంపికయ్యారు. తమిళనాడు రాష్ట్రం సేలంలోని పెరియార్ యూనివర్శిటీలో ఈనెల 4వ తేదీ నుంచి ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. కాలేజి క్రీడాకారులు కొనసాయి కిరణ్, కడగాల ప్రభుదేవ, బగాది మనోజ్‌సాయి, గొల్లవిల్లి పవన్‌కుమార్, కందుల చందు, ఆకునూరి చందు, కొట్టాడ శ్రీనివాసరావు యూనివర్శిటీ జట్టులో ఆడనున్నారు. ఈనెల 23-24 తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్శిటీలోని కాలేజి ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ స్పోర్ట్స్ సైన్సెస్ ఆధ్వర్యంలో అంతర కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీలు జరిగాయి. వీటిలో ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి జట్టు ఓవరాల్ టీం ఛాంపియన్‌షిప్‌ను రెండో పర్యాయం గెలుచుకోవటం విశేషం. ఆ జట్టులో ప్రతిభను ప్రదర్శించిన క్రీడాకారులను ఆచార్య నాగార్జున జట్టుకు ఎంపికచేశారు. ఏఎస్ఎన్ విద్యాసంస్థల ఛైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ క్రీడాకారులను అభినందించారు.

పంచముఖ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండోరోజున గురువారం సీతారాముల కల్యాణం, తిరుచ్చి వాహన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో యాజ్ఞికులు రఘురామ్, నాగమారుతీలు వైదిక క్రతువును ఆగమయుక్తంగా నిర్వహించారు. తొలుత విశ్వక్సేన పూజ, పుణ్యహావచన, నిత్యహోమాది కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ దంపతులు, నిఖిల్ శాండిల్య దంపతులు, దాతలు గుడివాడ బాలకృష్ణ దంపతులు, బచ్చు లీలాప్రసాదరావు దంపతులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. సీతారాముల కల్యాణంలో పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం సభ్యులు ఆలపించిన భక్తి కీర్తనలు అందరినీ అలరింపజేశాయి. పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు వెంటనే పూర్తి చేయాలి



అధికారులకు సూచనలిస్తున్న ప్రత్యేక అధికారి హనుమంతరావు, పక్కన ఎంపీపీ, జడ్పీటీసీ

భట్టిప్రోలు: భట్టిప్రోలు వైఎస్సార్ జగనన్న లే అవుట్‌లో పైప్‌లైన్ పనులు పూర్తి కాకపోవడంతో గృహ నిర్మాణంలో ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు మండల ప్రత్యేకాధికారి డాక్టర్ జె. హనుమంతరావు దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ దావూరి వెంకటలలిత కుమారి, జడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావుతో కలసి గురువారం ఆయన కాలనీని సందర్శించారు. కాంట్రాక్టర్ పైప్‌లైన్ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో గృహ నిర్మాణాలు పూర్తి కాలేదని నిర్ధారణకు వచ్చారు. వెంటనే కాంట్రాక్టర్‌తో మాట్లాడి.. పనులు పూర్తి చేయించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాగర్‌ను ఆదేశించారు. అనంతరం భట్టిప్రోలు–1 సచివాలయాన్ని సందర్శించారు. రెగ్యులర్ సెక్రటరీ లేకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు గమనించడం జరిగిందని తెలిపారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ రాజ్ ఏఈ శేతు రామచంద్రరరావు, ఇన్‌చార్జి సెక్రటరీ ఎ.రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కటీ సరిగా లేదు..



పెదలంక(భట్టిప్రోలు): మండలంలోని పెదలంక–1 అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా, అంగన్‌వాడీ కార్యకర్త విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జడ్పీటీసీ తిరువీధుల ఉదయ భాస్కరి ఆరోపించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావుతో కలసి వారు గురువారం పరిశీలించారు. ఆయా అందుబాటులో లేదని, రిజిస్టర్‌లో సంతకం కూడా చేయలేదని గుర్తించినట్లు చెప్పారు. కేంద్రంలో ఉండాల్సిన సరుకులకన్నా అధికంగా ఉన్నాయని, మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని.. ఈ విషయమై అమృతలూరు సీడీపీవో కె.విజయలక్ష్మిని వివరణ కోరగా అంగన్‌వాడీ సిబ్బందికి మెమో ఇచ్చినట్లు సమాధానం చెప్పారు. ఇటువంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. ఎంపీటీసీ నన్నెపాముల చంటి, పంచాయతీ కార్యదర్శి పుష్పలత, మహిళా పోలీస్ ఎం.శిరీష, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికను వేధిస్తున్న వ్యక్తికి దేహశుద్ధి

పట్నంబజారు: బాలిక వెంటపడి వేస్తున్న వ్యక్తికి దేహశుద్ధి చేసిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. అరండల్‌పేట ఎస్ఐ ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమయ్యనగర్‌కు చెందిన 11 ఏళ్ల బాలికను ఓ దుకాణంలో పని చేస్తున్న వెస్ట్ బెంగాల్‌కు చెందిన అనుమూల్ అనే వ్యక్తి వెంటపడి వేస్తున్నాడనే కారణంతో బాలిక తల్లిదండ్రులు, బంధువులు దేహశుద్ధి చేశారు. పోలీసులు నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

పిట్టలవానిపాలెం: వైఎస్సార్ బీమాతో ధీమాగా ఉండవచ్చని ఎంపీపీ షేక్ బాజీ పేర్కొన్నారు. మండలంలోని చందోలు శివారు రసూల్ పేటకు చెందిన ఎస్కే రబ్బాని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా కింద రూ.10 వేల నగదును గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్ ఉన్నారు.